ఎవరి ప్రయత్నాలు వారివి..

- సొసైటీలకు త్రీమెన్ కమిటీలు
- ఛైర్మన్ పదవి దక్కించుకోవడానికి సిగపట్లు
- జోరుగా కూటమి నేతల యత్నాలు



మధురపూడి: దేశానికి అన్నం పెట్టేదే వ్యవసాయ రంగం.. అలాంటి సాగులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకం. దీనిని సహకార సంస్థని కూడా పిలుస్తారు. రైతులకు సాగులో రుణ, తదితర సహకారాన్ని అందించడానికి ఏర్పాటైన ఈ సంస్థల్లో త్రీమెన్ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో పదవుల కోసం కూటమి నేతలు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ముగ్గురు వ్యక్తులతో ఈ కమిటీ ఏర్పడుతోంది. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గం మూడు మండలాల్లో 24 సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో సీతానగరం మండలంలో 15, కోరుకొండలో 5, రాజానగరంలో 4 సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. కోరుకొండ మండలంలో కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం, గాడాల గ్రామాల్లో, సీతానగరం మండలంలో ఉండేశ్వరపురం, మిర్తిపాడు, ములకల్లంక, కాటవరం, మునికూడలి, వెదుళ్లపల్లి, ఇనుగంటివారి పేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, కూనవరం, రాపాక, సీతానగరం, చినకొండేపూడి, వంగలపూడి, రామచంద్రపురం, రాజానగరం మండలంలో భూపాలపట్నం, నందరాడ, కానవరం, దివాన్‌చెరువు గ్రామాల్లో సొసైటీలు ఉన్నాయి.

పదవులు వరించేదెవరికి..

రాజానగరం నియోజకవర్గంలో సహకార సంఘాల త్రీమెన్ కమిటీలో పదవుల కోసం ఇప్పటికే చర్చ మొదలైంది. ఇక్కడ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జనసేన నుంచి గెలవడంతో ఆ పార్టీకి చెందిన వారికే అప్పగిస్తారేమో అని అంతా అనుకుంటున్నారు. అయితే ఈ పదవుల కోసం టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు పోటీ పడుతున్నారు. నియోజకవర్గ స్థాయి నాయకులైతే తమ పార్టీకి కేటాయించాలంటే, తమ పార్టీకి కేటాయించాలని పట్టుపడుతున్నారు. ముగ్గురు మాత్రమే సభ్యులు ఉండటంతో పదవులను ఎవరికి కట్టబెట్టాలో అని ఆ పార్టీ నాయకులు తనమునకలయ్యారు.

సమస్యలు గుర్తించి తీర్చడానికి..

వ్యవసాయ రంగానికి సహకారం అందించడానికి ఈ కమిటీలో ప్రతినిధులు కృషి చేయాలి. స్థానికులు పాలన విభాగంలో పరిపాలకులుగా ఉంటారు. ప్రతి 6 నెలలకోసారి సమావేశాలు నిర్వహించడానికి, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని, తర్వాత అధికారులనే పర్సన్ ఇంచార్జులుగా నియమిస్తూ ఆదేశాల్చింది. తర్వాత గత ప్రభుత్వ బాటను అనుసరించడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే స్థానికులతో త్రీమెన్ కమిటీల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది.

గత ప్రభుత్వ పాలన ఘనం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం త్రీమెన్ కమిటీల ద్వారా సహకార సంఘాలను పరిపుష్టం చేసింది. సొసైటీల్లో మల్టీ సర్వీసెస్ నిర్వహించే కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి కృషి జరిగింది. ఇందులో భాగంగా మౌలిక వసతుల కల్పన, గిడ్డంగి, సదుపాయాలను ఏర్పాటు చేసింది. విత్తనం నుంచి విక్రయం వరకూ రైతన్నలకు సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందించాలన్న లక్ష్యంతో పనిచేసింది. పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకూ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అనువుగా సొసైటీలు, సచివాలయాలను తీర్చిదిద్దింది. అది రైతులకు ఉపయోగపడింది.

రైతులకు ప్రయోజనం



సొసైటీలో త్రిమెన్ కమిటీలతో రైతులకు ప్రయోజనం జరుగుతోంది. స్థానిక రైతుల వ్యవసాయ అవసరాలను తెలుసుకుని త్వరగా నెరవేర్చడానికి అవకాశముంటుంది. రైతులకు అవసరమైన నిర్ణయాలను తీసుకోవచ్చు. ప్రభుత్వం సొసైటీలను మల్టీ సర్వీసెస్ సెంటర్లుగా తీర్చిదిద్దుతోంది. దీనిద్వారా రైల్వే టిక్కెట్లు, దేవస్థానాల్లో దైవ దర్శనానికి టిక్కెట్లు, తదితర సేవలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుతున్నాయి.

– గాజింగి అప్పారావు, మేనేజర్, డీసీసీబీ, కోరుకొండ

జగన్ పాలనే భవిష్యత్తుకు పునాది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో త్రీమెన్ కమిటీలకు పాలన అప్పగించడం మంచి పరిణామం. మాజీ సీఎం జగన్ పాలన భవిష్యత్తు అభివృద్ధికి మార్గమవుతోంది. దానినే కూటమి ప్రభుత్వం అనుసరిస్తోంది. ప్రస్తుత పరిస్థితిలో అధికారులను పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించడం కంటే, త్రిమెన్ కమిటీల ఏర్పాటు రైతులకు ఉపయోగకరం.

– నక్కా రాంబాబు, రాజానగరం మాజీ మార్కెట్ యార్డు చైర్మన్

క్లుప్తంగా

రైతులకు అందుబాటులో యూరియా



రఘుదేవపురం పీఏసీఎస్ గొడౌన్‌లో యూరియా నిల్వలను పరిశీలించిన ఏఓ సూర్యరమేష్

సీతానగరం: మండల గ్రామాల్లో రైతులకు యూరియాను అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పొగాకు, అరటి, కూరగాయలతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారన్నారు. రబీ సీజన్‌లో అంటే మార్చి నెలాఖరు వరకూ వీటికి సుమారు 4,150 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటికే 2,800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని వివరించారు. వాటిలో 2,650 మెట్రిక్ టన్నులు రైతులు తీసుకోగా, 150 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. యూరియా దొరకడం లేదని వదంతులు రావడంతో ఆ సీజన్‌కు సరిపడా యూరియా ఒకేసారి కొనుగోలు చేయడంతో కృత్రిమ కొరత ఏర్పడుతుందని తెలిపారు. రైతులు ఒకేసారి కొనుగోలు చేయవద్దని, మరో నాలుగు రోజుల్లో సుమారు 400 మెట్రిక్ టన్నులు మండలానికి వస్తుందని ఏఓ తెలిపారు. అనంతరం రఘుదేవపురం పీఏసీఎస్ గొడౌన్‌లో యూరియా నిల్వలను ఆయన పరిశీలించారు.

సిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపర సిద్ధి వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామ పంట కాలువ సమీపంలో ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకునికి బుధవారం గరికపూజ, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే సంపరలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదాదేవికి ధనుర్మాసం సందర్భంగా అమ్మవారికి మంగళ హారతి ఇచ్చారు. గోదా అమ్మవారికి పచ్చ కర్పూరంతో మహిళలు ఈ కార్యక్రమం చేపట్టారు. గోవిందనామ స్మరణతో పారాయణ చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి



పెదపూడిలో చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపర్చేందుకు సచివాలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం పెదపూడి, జి.మామిడాడ గ్రామాల్లోని మెయిన్ రోడ్డులో ఆయన జేసీబీ సహాయంతో చెత్త తొలగింపు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రతతో గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. మురుగు కాలువల్లో పూడిక, చెత్త, తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శులు నాగేంద్ర, ఉషారాణి, ఆరోగ్యశాఖ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సేవలు

బిక్కవోలు: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నీటి సంఘ నేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ పడాల వెంకట రామారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు, కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

10న ఉత్తర ద్వార దర్శనం

మధురపూడి: ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉదయం 5.30 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజబట్టర్ తెలిపారు. ఏకాదశి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 13న మధ్యాహ్నం రెండు గంటలకు గోదా కల్యాణం జరుపుతామన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



వ్యాసరచనలో విజేతలకు మెమెంటోలు ఇచ్చిన ప్రిన్సిపాల్ దొరబాబు, సేవా సమితి సభ్యులు

సీతానగరం: రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాల్లో శ్రీసత్యసాయి సేవా సంస్థ 'ఇచ్చుట క్షమించుట' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో తృతీయ స్థానాన్ని స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థిని ఆళ్ల క్రాంతి సాధించారు. ఈ మేరకు బుధవారం సీతానగరం జూనియర్ కళాశాలలో అభినందన కార్యక్రమం జరిగింది. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఇంటర్ సెకండియర్ సీఈసీ విద్యార్థిని ఆళ్ల క్రాంతి, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థి కె.చరణ్, సీఈసీ విద్యార్థిని సీహెచ్ రమ్యప్రియలు సాధించగా మండల శ్రీసత్యసాయి సేవా సమితి వారు సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు మాట్లాడుతూ కళాశాల నుంచి మండల ప్రథమ, జిల్లా స్థాయి తృతీయ స్థానం సాధించిన ఆళ్ల క్రాంతిని అభినందించారు. సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సత్యసాయి విద్యాలయం పుట్టపర్తి వద్ద ఎల్‌కేజీ నుంచి స్కాలర్ వరకూ ఉచిత విద్య అందిస్తున్నారని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో అధ్యాపకులు పి.చిన్నారావు, నరసింహం, వెంకటరమణ, సురేష్, పాండురంగ వరప్రసాద్, కె.ఉమారాణి, బి.కోటేశ్వరరావు, ఏఎస్ శేఖర్‌బాబు, ఆర్.శ్రీనివాస్, వి.ఠాగూర్ కుమార్, ఎస్.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే నిర్వాహకులతో పాటు, స్థల యజమానులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు హెచ్చరించారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాపతిరావు, ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, ఎస్సై రామారావు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల ప్రకారం కోడిపందేలపై నిషేధం ఉందన్నారు. కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా ఎవరైనా సంప్రదాయాల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి పందేల నిర్వహణకు టెంట్ సామగ్రి, విద్యుత్ లైట్లు సరఫరా చేస్తే వారిపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. నేర చరిత్ర, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. పందేలు నిర్వహించే పలు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంత ప్రజలకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. జూదాలు ఆడి నగదు పోగొట్టుకోవద్దని ప్రజలకు ఆయన హితవు పలికారు. మద్యం తాగి ప్రమాదాలకు గురికావద్దని, అలాగే పండగను సంతోషంగా జరుపుకోవాలని వారు తెలిపారు. మండలంలో జూదాల నివారణకు తహసీల్దార్ చైర్మన్‌గా, ఎస్సై, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్‌తో కూడిన టీమ్ ఏర్పాటు చేశామన్నారు.

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ



చక్రద్వారబంధంలో మృతుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలో ఇటీవల వివిధ కారణాలతో పలువురు మృతి చెందగా, వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. తండ్రి మృతితో బాధపడుతున్న చక్రద్వారబంధానికి చెందిన నీలపాల శివ రామకృష్ణను, కానవరానికి చెందిన సంగిశెట్టి వెంకట్రావును, తల్లి మృతితో కలత చెందుతున్న చక్రద్వారబంధానికి చెందిన పేపకాయల వీరగోవింద్‌ను, కొండగుంటూరుకు చెందిన పల్లేటి జాన్ ప్రకాష్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ప్రమాదానికి గురై చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చక్రద్వారబంధానికి చెందిన నాగవరపు వీరవెంకటరమణను కలుసుకుని ధైర్యం చెప్పారు.

ఆక్రమణల తొలగింపుపై దృష్టి పెట్టాలి



రంగంపేట వద్ద ఏడీబీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రంగంపేట: ఏడీబీ రోడ్డు అభివృద్ధిలో భాగంగా భూసేకరణ భూముల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం ఆమె రంగంపేట మండల పరిధిలో జరుగుతున్న ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాయుడుతో కలసి ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ–రాజానగరం ప్రధాన రహదారి మార్గంలో ఏపీ రహదారుల, అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయడంలో మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు.

కాకినాడ– తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన ప్రధాన రహదారి మార్గాన్ని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి, అక్కడి నుంచి వారిని తరలించి, ఆయా నిర్మాణాలు తొలగించే విషయాల్లో హేతుబద్ధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనంతరం రంగంపేట మండలం ఎస్టీరాజాపురం, వడిశలేరు గ్రామాలకు చెందిన భూములను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్, ఆర్‌డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకాంత్, తహసీల్దార్లు లావణ్య, కోసు అనసూయ, డీటీ యు.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనుల నిమిత్తం గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఓల్డ్ బొమ్మూరు, మురళీకొండ, సోమనవారి తోట, జీపీఆర్ రోడ్, ఏఎమ్‌జీ కళాశాల వెనుక ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ముచ్చటగా తెలుగు మహాసభలు



తబలా వాయిస్తున్న అనురాధా పాల్



సాంస్కృతిక ప్రదర్శన అనంతరం బృందాన్ని అభినందిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలను చూస్తుంటే ఎంతో ముచ్చట కలుగుతుందని మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. బుధవారం జీజీయూలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఇటువంటి సభలలో 60 ఏళ్లు పైబడిన వారే ఎక్కువ కనిపిస్తుంటారని, కానీ ఇక్కడ అందుకు భిన్నంగా ఎక్కువగా యువతే ఉండడం అభినందనీయమన్నారు. మాతృభాష పట్ల యువతకు ఆదరణ, అభిమానాలు ఉన్నాయనే విషయం ఈ విధంగా తేటతెల్లం అవుతుందన్నారు. పెద్దలు కూడా ఈ విషయమై మరింత శ్రద్ధ తీసుకుని, ఇంట్లోనే కాదు సభలు, సమావేశాల్లోనూ మాతృభాషలో మాట్లాడే విధంగా తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. తెలుగు భాష పట్ల తనకు ఉన్న ప్రేమతోనే గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ చాన్సలర్, సభాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. గత ఏడాది తిరుమల శ్రీవేంకటేశ్వరుని నమూనా ఆలయంతో శ్రీనివాసుని దర్శించుకునే అవకాశం కల్పిస్తే, ఈసారి కృత్రిమ మేధ, సాంకేతికతను ఉపయోగించి అయోధ్య బాలరాముని నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఆలయం వద్దే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ల అవతార్‌లను ఏర్పాటు చేశామన్నారు. సంగీత స్వరకర్త, ప్రముఖ తబలా వాయిద్య కారిణి అనురాధా పాల్ తోపాటు పలువురిని విశిష్ట పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అనురాధా పాల్ ప్రదర్శించిన తబలా వాయిద్యం విశేషంగా ఆకట్టుకుంది.

కృష్ణావతారంలో భజేనారాయణస్వామి



కృష్ణావతారంలో ఉన్న భజేనారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: వడిశలేరు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారిని కృష్ణావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కృష్ణావతారంలో ఉన్న భజేనారాయణ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం బుద్ధావతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి పి.ప్రియాంక తెలిపారు.

మేకలు, గొర్రెల పెంపకంపై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ నాయుడు

రాజానగరం: సోషల్ మీడియాను నమ్మి, తెలిసీ తెలియని విధంగా పశువుల షెడ్లను నిర్మించుకుని, ఆర్థికంగా నష్టపోవద్దని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. వీటి పెంపకం పట్ల ఏమాత్రం ఆసక్తి ఉన్నసరే తమను సంప్రదిస్తే, అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. కేవీవీలో జిల్లా ఆత్మ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు శాస్త్రీయ పద్ధతిలో మేకలు, గొర్రెల పెంపకంపై వారం రోజులపాటు ఇచ్చిన శిక్షణ, ప్రదర్శన కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గొల్లప్రోలు, రాజానగరం, ప్రత్తిపాడు, తొండంగి, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ మండలాలకు చెందిన 15 మంది ఔత్సాహిక యువకులు ఈ శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లతోపాటు మేకలు, గొర్రెలు, పశువుల పెంపకంపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వై.జ్యోతిర్మయి, ఉద్యాన పంటల విభాగం అధికారి జేవీఆర్ సత్యవాణి, పశు పోషణాధికారి డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కోరుకొండలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు

మధురపూడి: ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కాకి మాధవరావు అన్నారు. బుధవారం ఆయన కోరుకొండలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు నమూనాలను సేకరించి పరీక్షా కేంద్రానికి పంపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో వరి నాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. యూరియాను అధిక మోతాదులో వాడడం మంచిది కాదన్నారు. యూరియాతో పాటు, కాంప్లెక్స్ ఎరువులు నత్రజని, డీఏపీ, పొటాస్ వాడితే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. నాట్ల సమయంలో 25 కేజీల యూరియా, 50 కేజీల డీఏపీ, 15 కేజీల పొటాష్‌ను ఉపయోగిస్తే ఆరోగ్యకరమైన పంటను దక్కించుకోవచ్చన్నారు. దీనివల్ల భూమి సారవంతం అవుతోందన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి జగదీష్, ఏడీ మల్లికార్జునరావు, ఏఓ గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ కీర్తనలతో భక్తి, జ్ఞానం



త్యాగరాజ రామభక్తిపై ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

పెదపూడి: త్యాగరాజ స్వామి రామభక్తి కీర్తనలతో భక్తి, జ్ఞానం, వైరాగ్యంపై ప్రబోధించారని ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. అనపర్తి శారదా సంగీత కళా సమితి వారి 26వ త్యాగరాజు ఆరాధన ఉత్సవాల ఆరో రోజు బుధవారం త్యాగరాజ రామభక్తి అనే అంశంపై రెండో రోజు ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం సాగింది. దీనిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. షణ్ముఖశర్మ ప్రసంగిస్తూ రామభక్తిపై త్యాగరాజ సొంతంగానే రచించి స్వరపరిచినవే ఈ కీర్తనలన్నీ అని తెలియజేశారు. అనేక మంది శిష్యులను త్యాగరాజ తయారు చేశారన్నారు. ఇప్పుడు ఉన్న వారందరూ త్యాగరాజ శిష్యులే అని తెలిపారు. జి.లక్ష్మీదేవి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొవ్వూరి శ్రీనివాసారెడ్డి (దత్తుడు శ్రీను), సత్తి దేవానందరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరెడ్డి, పడాల కల్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



మర్రిపూడిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

రంగంపేట: ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవివెంకటేశ్వరరావు కోరారు. రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మర్రిపూడి అంగన్‌వాడీ కేంద్రాలు 1, 2 వద్ద బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ శ్రీదేవివెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వేము మాధవిచిరంజీవి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం బాలసంజీవిని కిట్లు, బియ్యం, కందిపప్పు, నూనె, పాలు పంపిణీ చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.16 లక్షలతో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అనపర్తిలో ఐఎల్‌టీడీ వద్ద ఉన్న మసీద్ ఇమామ్ ఆసిఫ్ కుమారుడికి వైద్యం సహాయం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4 లక్షల చెక్కును పంపిణీ చేశారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి దరియా యూసఫ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు మూడు అర్జీలు

సీతానగరం: బొబ్బిల్లంకలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం ఒకటి, భూమి విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, సర్వే చేయాలని అర్జీలు వచ్చాయన్నారు. సర్వేయర్ గౌతమ్, వీఆర్వో నాగమణి, ఎండోమెంట్ ఈఓ పాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు